# చివరి మలుపు

**—షీలా శివరామ్**

ఈమధ్య తరుచుగా రవి పెళ్ళిని గూర్చిన ఊహాలే మెదులుతున్నాయి మనసులో. ఆయన ప్రొద్దుట పది గంటల కల్లా కోర్టుకి వెళ్ళి, సాయంత్రం నాలుగ్గంటలకి తిరిగొచ్చే టంతవరకు లంకంత బంగళాలో ఒంటరిగా ఉండటం కష్టమనిపిస్తోంది. అక్కడికీ కరుణాశ్రమం ధర్మమా అంటూ కొంత కాలం ఆశ్రమ కార్యకలాపాలతో గడిచి పోతూ ఉంటుంది. ఈమధ్య ఆశ్రమ కార్యక్రమాల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనలేకపోతున్నాను. నలభై దాటిన తరవాత వయసు వాలిపోతుందేమో ననిపిస్తోంది. ఒంట్లో ఓపిక, ఉత్సాహం తగ్గిపోతున్నాయి. ఇల్లు కదలకుండా ప్రశాంతంగా కళ్ళు మూసుకు కూర్చోవాలనిపిస్తోంది ఈ గృహ బాధ్యతలని వదులుకుని. ఈ గృహ నిర్వహణాధికారాన్ని భుజాల కెత్తుకుని, నన్నుకూడా ఒక పసిపాపలాగా లాలించే వ్యక్తి దొరికితే బాగుండును. ఆ వ్యక్తి మరెవరో ఎలా అవగలరు, నా కోడలు తప్ప!

ఈ విషయంలో ఎంత చెప్పినా నా మాట వినిపించుకోవటం లేదు రవి. చదువయ్యేంత వరకు చదువని తప్పించుకున్నాడు. ఆ తరవాత 'హార్టు స్పెషలైజ్' చెయ్యాలంటూ అమెరికా వెళ్ళిపోయాడు. ఆరు నెల్ల క్రితం తిరిగొచ్చాడు. అప్పుడయినా నా మాట వినిపించుకోడే! 'ఒక్క ఆరు నెల్లు మద్రాసులో పనమ్మా. ఆ తరవాత నువ్వు బొమ్మకి ముడెయ్యమన్నా వేసేస్తాను, సరేనా?' అంటూ మభ్యపెట్టాడు. అప్పుడే నాలుగు నెలలు గడిచిపోయాయి. మరొక్క రెండు నెలలు. ఈలోగా నాకు నచ్చిన పిల్లని చూసి నిశ్చయం చేసి పెట్టాలి. రవికి తప్పకుండా నచ్చుతుంది నా ఎంపిక. చిలకా గోరింకల్లా ఇద్దరూ కలకల్లాడుతూ ఇంట్లో తిరుగుతూ ఉంటే, కన్నుల పండువగా మరో ఏడాదిలో పనస పండంటి బుడత డొస్తే, ఇక నాకు కాలక్షేపానికి కొదవేమిటి! నా అంత అదృష్టవంతులు మరెవరూ ఉండరు ఈ సృష్టిలో. ఏమో? ఈ ఫామిలీ ప్లానింగు లొకటి గదా ప్రాణానికి! వాళ్ళే మూడు నాలుగేళ్ళో మడికట్టుకు కూర్చుంటే ఏం చెయ్యాలి? వాళ్ళ కా సంగతి మొదటే చెప్పాలి. ఎలా?

"అత్తయ్యా, అత్తయ్యా!"

"......"

"మాట్లాడరేమి టత్తయ్యా? భోజనం చెయ్యరా?"

"నన్ను విసిగించ కమ్మాయి."

"మీకోసం అరగంట నించి వెయిట్ చేస్తున్నారు మీ అబ్బాయి. ప్రొద్దున్న ఫలహారం కూడా చెయ్యలేదు మీరు. నీరసంగా లేదూ? త్వరగా రండి."

"నేను భోజనం చెయ్యను అంటే నీక్కాదూ?"

"ఏమి టత్తయ్యా, మీరు మరీ పసిపిల్లల్లాగా!"

"నన్ను విసిగించకు. మీ ఇద్దరూ ఏదో ఒక మాట నాకు చెప్పేంతవరకూ నేను భోజనం చెయ్యను. సరేనా?"

అంతే కావాలి వీళ్ళకి.

"హ నీ! అమ్మేది?"

"రారట!"


"ఏం?"

"మీరే వెళ్ళి అడగండి."

"అరే. అంత సిగ్గుపడతా వేమిటోయ్? ఏమి సంగతి?"

"ఊహుఁ."

"ఊఁ చెప్పాలి."



"అబ్బా! ఏమిటది? అత్తయ్య చూస్తున్నారు. వదలండి."

"అయితే చెప్పాలి."

"అత్తయ్యకి ఆడుకోవటానికి ఒక కదిలే బొమ్మ కావాలట. తెలిసిందా?"

"ఓస్ ఇంతేనా! కదిలేదేం ఖర్మ? ఏడ్చేవి, పరుగెత్తేవి, నవ్వేవి ఎన్నో ఉన్నాయి బజార్లో. సాయంత్రం బజారుకి తీసుకెళ్ళి అమ్మకేం కావాలో అవన్నీ కొనిపెట్టు, తెలిసిందా?"

"అయ్యో రామ! మాట లర్థంకాని మీరేం డాక్టర్లు అని!"

"వాట్?"

"ఇంకా అర్థం కాలే? ఇలా వంగండి చెపుతాను."

"ఓహ్. అదా! అయితే ఇచ్చేద్దామా?"

"ష్ . . . దూరం!"

"అత్తయ్య ఏమన్నారో తెలుసా? మీ కులాసాలకి, షికార్లకి వాడేం అడ్డం రాడు. వాడిని నేను పెంచుతాను. మీ దోవన మీరు తిరగచ్చు. వాడిని మాత్రం ఇవ్వమని చెప్పు మా అబ్బాయితో అంటున్నారు. అవిడికి ఏ మాటా చెప్పకపోతే భోజనం చెయ్యరట."

"నిరశన వ్రతమా? ఓ.కె. అందామా? విత్ యువర్ పెర్మిషన్, మేడమ్! వాట్ ఎ బ్యూటీ డార్లింగ్! ఆడవాళ్ళకి సిగ్గందం అని ఏ మహానుభావుడోయ్ చెప్పింది!"

"ష్. పదండి, అత్తయ్యని తీసుకొద్దాం."

పరీధావి
దీపావళి కథల
పోటీలో
మొదటి బహుమతి
పొందినది

"అమ్మా!"

నాకు తెలుసు నా రవి నన్ను కాదనడని. విజయగర్వంతో కళ్ళు తెరిచాను.

"అమ్మా! రేపటికల్లా — సారీ — త్వరలో నీ క్కావలసింది ఇవ్వటానికి మీ కోడలు ఒప్పుకుంది. కనక నువ్వు నిరశన వ్రతం సమాప్తి గావించి భోజనానికి రావలెను."

సిగ్గుల మొగ్గలాగ తలవంచుకున్న కోడల్ని చిరునవ్వుతో చూస్తూ ఠీవిగా, దర్జాగా, రాజమాతలాగ టేబిలు వైపు నడిచాను.

• • •

"ఏమిటోయ్! నిద్రలో నువ్వు నవ్వుకుంటున్నావు? కలొచ్చిందా?"

మా లాయరుగారి బూట్ల చప్పుడుతో కళ్ళు తెరిచాను. "ఓహ్! అయితే ఇదంతా నా ఊహా! నిజం కాదన్న మాట!" పైకే వచ్చాయి నా మాటలు.

"ఎందుక్కాదోయ్? నిజమే. ఇదిగో, రవి ఉత్తరం రాశాడు."

ఆత్రంగా అందుకున్నాను. "ఏం రాశాడు?"

"కోడలితో, మనమడితో తిరిగొస్తున్నాట్ట!" బూట్లు విప్పి కార్పెట్‌మీద పడేశారు.

"ఏమిటి మీ రవేది? ఎవరి సంగతి?"

"ఎవరి సంగతో నీ కెందుకు చెబుతానోయ్! సాక్షాత్ పార్వతీ తనయుడైన చిరంజీవి రవిచందర్‌ని గురించే నే చెప్పేది."

"హాస్యం కట్టిపెట్టి, సంగతేమిటో అర్థమయ్యేట్టు చెప్పండి."

"పార్వతీ! నా ఈ పాతికేళ్ళ న్యాయవాద వృత్తిలో నేను తెలుసుకున్న దేమిటో తెలుసా? నా ధర్మపత్ని, అర్థాంగిని అయిన శ్రీమతి పార్వతీ శంకరానికి అర్థమయ్యేట్టుగా మాట్లాడటం నా చేత కాదని."

"అన్నీ డొంక తిరుగుడు మాటలే!" ఆత్రంగా కవరు విప్పి చదివాను.

"ప్రియమైన అమ్మకి,

శుక్రవారం ప్రొద్దుట మెయిల్లో నీ చిరకాల వాంఛితాన్ని వెంట తీసుకుని వస్తున్నాను. రేపటినించి నీకు మనమడితో ఆడుకోవటానికే టైమ్ చాలదు. కనక ఈ రోజే నీ ఆశ్రమ కార్యక్రమాలన్నీ మరొకళ్లకి అప్పచెప్పేయి. వివరాలన్నీ సముఖంలో. నీకూ, నాన్నగారికీ నమస్కారాలతో . . .

—నీ, రవి."

"ఏమిటండీ! ఇదంతా?"

"నాకుమాత్రం ఏం తెలుసండీ!"

"కొంపదీసి చదివే రోజుల్లో ఏదయినా ఘనకార్యం చేశాడంటారా ఏమిటి? మనమడంటా డేమిటి?"

"పార్వతీ! ఎందు కంత ఆరాటం? వస్తున్నాడుగా రేపు! అన్నీ అవే తెలుస్తాయి. కాస్త నా కాఫీ సంగతి చూడు."

చదివిన పంక్తుల్నే మళ్లీ, మళ్లీ చదువుతూ వంట గది వైపు నడిచాను.

"ఎనిమిది గంట లయింది. ఈ గడియారం ఇంత నెమ్మదిగా నడుస్తోం దేమిటే? కీ ఇవ్వలేదా ఈవేళ?"

"కీ ఇవ్వకపోతే ఆగిపోతుంది, పార్వతీ! నెమ్మదిగా నడవదు. నీ కొడుకు వస్తున్న ఈ శుభ ముహూర్తంలో నీకు టైము నడుస్తున్నట్టుగా లేదు."

"మెయిలు ఎన్నింటికి?"

"తొమ్మిది గంటల కని ఇది పదోసారి చెప్పటం!"

"కారు తీసుకువెళ్లమని వీరాస్వామితో చెప్పారా?"

"నువ్వే చెప్పావు గదుటోయ్ ఇప్పటికి నాలుగుసార్లు అతగాడితో?"

• • •

'అమ్మయ్య! తొమ్మిది గంట లయింది. ఇంకా రాలేదే!'

"ఏమండీ! ఒకసారి స్టేషనుకి ఫోను చెయ్యండి — మెయిలు లేటేమో?"

"అబ్బబ్బ! పార్వతీ! రైలు దిగిన వాళ్లు కార్లో ఎక్కాలా అక్కర్లేదా? అదిగో, కారొచ్చేసింది!"

కారు గేటులోంచి వరండా ముందు కొచ్చి ఆగింది. వరండా చివరికి పరుగెత్తాను.

రవి . . . నా రవి నిండుగా, హుందాగా ఫుల్ సూట్‌లో దిగాడు. ఎవరా వెనకాల ఒదిగి నిలుచుంది? ఎక్కడో చూసినట్లున్నానే! ఆ కుర్రా డెవరు? అచ్చు గుమ్మడి పండల్లే ఉన్నాడే! బూరె బుగ్గలు, నల్ల కళ్ళు, వంకీల జుట్టు! ఆత్రంగా రెండడుగులు ముందుకు వేశాను. మెల్లెక్కి పైకి వచ్చారు. మరో అడుగు ముందుకు పడింది.

రవి కళ్లు ప్రేమగా నన్ను పలకరించాయి.

"సీతా! మా అమ్మ!" వెనక నున్న తటిల్లతని భుజం పట్టి ముందు నించో బెట్టాడు.

చేతులు జోడించి తల ఎత్తిన తటిల్లత మెరుపు కొట్టినట్టు ఆగిపోయింది.



దీపనృత్యం

చిత్రం—బి. ఎ. లలిత (కరీంనగర్)

"మీరు ... మీరు ..."

అవును. గుర్తొచ్చింది ఇప్పుడు.

"నువ్వు ... నువ్వు ... అక్కడ ... అతను ..." నా కళ్ల ముందు ప్రపంచం గిరగిరా తిరుగుతూంది. నల్లటి, పలచటి తెర క్రిందికి జారుతూంది. నా కళ్లు మూతలు పడుతున్నాయి.

"అమ్మా, అమ్మా! ఏమయిం దమ్మా?" ఆత్రంగా నన్ను పట్టుకున్న రవి భుజం మీద నా తల వాలిపోయింది. కళ్ల ముందు వలయాలు గిరగిరా తిరుగుతున్నయి.

మూడేళ్ల క్రిందట ...

రవిని బొంబాయిలో ప్లేనెక్కించి మేమిద్దరం తిరిగొస్తున్నాం. రైలు ి ఋవాడలో ఆగింది. పళ్లు తెస్తానని ఆయన క్రిందికి దిగి వెళ్లారు. కిటికీ లోంచి బయటికి చూస్తున్నాను. కాబిన్ తలుపు నెట్టిన చప్పుడుకి తల తిప్పి చూశాను. ఓ యువ జంట లోపలి కొచ్చింది. తెల్లగా, సన్నగా వంకీల జుట్టు. టక్ చేసిన తెల్ల షర్టు, తెల్ల పాంటులో ఉన్న కుర్రాడు బెర్తు నంబరు చూస్తూ, "ఆఁ. ఇదేనోయ్ బెర్తు. కిందగా పెట్టు సామాను" అంటున్నాడు కూలీతో.

వెనకాల ఉన్న పిల్ల చేతిలోని పొత్తిళ్ల లోని బిడ్డని అందుకుని, "సుబీ! నువ్వు బాబుకి బెర్తు మీద ఎక్క వేయి" అన్నాడు. ఆ పిల్లవైపు పరీక్షగా చూశాను. ఇరవయ్యేళ్ల వయ సుంటుంది. సన్నగా, పొడుగ్గా ఉన్న పచ్చటి ఒంటి మీద ఎర్రటి ధర్మవరం పట్టుచీర మెరుస్తూంది. వంకీలుగా, పొట్టిగా, దుబ్బుగా ఉన్న జడ, చెవులకి రింగులు. వంగుని బుట్టలోని బట్టలు తీస్తూ నావైపు చూసి పలకరింపుగా నవ్వింది. మెరుపు మెరిసినట్లు తళుక్కుమన్నాయి నవ్వే కళ్లు. ముచ్చటగా చూస్తూ కూర్చున్నాను.

సీటు మీద పక్క పరిచి, పిల్లాడిని ఒడిలోకి తీసుకుని కూర్చుంది.

"సుబీ! ఫ్లాస్కులో కాఫీ తెస్తాను. పళ్లు కావాలా? బాబుకి మరేమయినా అవసర ముంటుందా? త్వరగా చెప్పు" అంటూ హడావిడిగా ఫ్లాస్కు తీసుకు దిగిపోయాడు.

ఆ పిల్ల చిరునవ్వుతో భర్త హడావిడి గమనిస్తూ కూర్చుంది. అతను తుఫాను లాగా అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు ఫ్లాస్కు, పేపర్లో పళ్లు, ఇన్ని మేగజైన్లు పట్టుకుని. ఆ పిల్ల పక్కగా కూర్చున్నాడు.

"బాబు నిద్రపోయాడా? వానొచ్చే ట్టుగా ఉంది. వాడికి స్వెట్టరు వేస్తావా?" అంటూ ఆ పిల్ల ఒడిలోని పసివాడి బుగ్గలు నిమిరాడు.

వాతావరణం చాలా ఉక్కగా ఉంది గాలి లేకుండా. వానొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఆ పిల్ల నుదుటి మీద, ముక్కు మీద ముత్యాల్లాగా చెమట బిందువులు మెరుస్తున్నాయి. అతను చటుక్కున తన రుమాలుతో అద్దాడు. ఆ పిల్ల కాస్త సిగ్గుపడ్డది భర్త ప్రేమ ప్రదర్శనకి. కాస్త చురుగ్గా చూసింది అతనివైపు, కళ్లతో నా వైపు పంజ్ఞ చేస్తూ. అతను అప్పటికి కంపార్టుమెంటులో మూడో వ్యక్తి ఉనికిని గమనించినట్టు నా వైపు చూసి చిన్నగా నవ్వి, ఫాను ఆ పిల్ల వైపు తిప్పటానికి లేచి నిలబడ్డాడు.

అదే సమయంలో రైలు కూత వేసి ముందుకి కదిలింది. నిలబడ్డ అతను ముందుకి తూలాడు. ఆ పిల్ల గాభరాగా అతని నడుం పుచ్చుకుని వెనక్కి లాగింది, పడిపోతాడేమో నన్నట్టు. అతను తల తిప్పి కొంటెగా చూశాడు ఆ పిల్ల వైపు.

"ముందుకి పడేవారు కాస్తుంటే" అంది మూతి బిగించి అతనివైపు చూస్తూ.

"ముందుకి పడితే ఏం ప్రయోజనం? వెనక్కి పడితేనే లక్!" మెల్లిగా అంటూ నవ్వాడు. ఆ పిల్ల సిగ్గుగా, కోపంగా చూసి కళ్లు వాల్చుకుంది.

మా లాయరుగారు పత్రికలు, పేపరు, పళ్లు పట్టుకుని లోపలి కొచ్చి కూచున్నారు. రైలు మెల్లిమెల్లిగా వేగం పుందుకుంది. చక్రాల శబ్దంలో వాళ్ల మాటలు వినపడటం మానేశాయి. ఇద్దరూ నెమ్మదిగా మాట్లాడుతూ,

మధ్య మధ్య నవ్వుతూ, కళ్ళతో పలకరించుకుంటూ, మధ్యలో పసివాడిని ముద్దుచేస్తూ కూర్చున్నారు. అతను మాటిమాటికి ఆ పిల్ల మీదికి వంగి మాట్లాడుతూ ఉండటం, ఆ పిల్ల మమ్మల్ని చూసి సిగ్గుపడుతూ కాస్త ఇవతలకి జరగటం...ఇలా ఓ అరగంట గడిచేసరికి సీటుకి ఆ చివర కూర్చున్న దల్లా ఈ చివరి కొచ్చింది, జరుగుతూ. ఇంక జరగటానికి చోటు లేక కోపంగా ఏదో అంది అతని వైపు తిరిగి. అతను ఒక్క క్షణం మా ఇద్దరి వైపు చూసి,



తిరిగి ఆ పిల్ల వైపు చూసి కొంటెగా నవ్వి, "ఏది?" అన్నాడు. ఆ పిల్ల 'ఛీ! నీకు, సిగ్గు లేదు' అన్నట్టుగా, మురిపెంగా, సిగ్గుగా కోపంగా చూసి కిటికీవేపు తిరిగి కూర్చుంది.

అతను నవ్వుకుంటూ ఏవో పుస్తకాలు తిరగవెయ్యసాగాడు.

రెండు స్టేషన్లు గడిచిపోయాయి. బయట వాన జల్లుగా పడుతూంది. కిటికీ లోంచి వాన తుంపర్లు లోపలికి పడ సాగాయి. అతను లేచి కిటికీ గ్లాసు డోరు వేశాడు. పసిబిడ్డని ఆ పిల్ల ఒడి లోంచి తీసి పక్క మీద పడుకోబెట్టి నిండా దుప్పటి కప్పాడు.

"ఎంతసేపు కూర్చుంటావు? కాసేపు పడుకుంటావా పై బెర్తు మీద? బాబుని నేనుచూస్తూఉంటాను" అన్నాడు.

ఆ పిల్ల వద్దన్నట్టుగా తల తిప్పి, దిళ్లకి జేరబడి వీక్లీ చూస్తూ కూర్చుంది. అతను మా లాయరుగారితో సంభాషణ ప్రారంభించాడు.

"ఎక్కడివరకు, సార్?"

"గూడూరోయ్. మీ రెంత వరకు?"

"మద్రాసండీ."

"అక్కడ జాబా?"

"అవునండీ. వాన వదిలేట్టుగా లేదు ఈ వేళ" అన్నాడు.

"పేపర్లో చూడలేదుటోయ్ 'బంగాళా ఖాతంలో సుడిగుండం' అని? దాని ప్రభావమే ఇదంతా."

ఇద్దరి సంభాషణా మరి కాసేపు రాజకీయాల్ని గురించి, ఆ తరవాత నిరుద్యోగ నిర్మూలనాన్ని గూర్చి, ఆ తరవాత క్రికెట్ గురించి సాగింది.

ఆఖరుకి మా లాయరుగారు పేపరు పక్కన పడేసి, "పార్వతీ! రెండు పళ్లందుకో, కడుపులో ఎలికలు రొద చేస్తున్నాయి" అన్నారు.

అంతవరకూ కాసేపు కళ్లు మూస్తూ, కాసేపు వీక్లీ చదువుతూన్న పిల్ల — "భోజనం చేద్దామా?" అంది అతనితో.

అతను సీటు కింద నుంచి బుట్ట బయటికి లాగాడు. కారియరు బయటికి తీసి రెండు ప్లేట్లలో సర్దాడు. సీటు మీద టవలు పరచి, దానిమీద ప్లేట్లు పెట్టుకుని ఒకరి కొకరు ఎదురుకూర్చుని కబుర్లాడుతూ భోజనం సాగించారు. అతను కొసరి కొసరి పదార్థాలను ఆ పిల్ల పళ్లెంలో వేయటం, ఆ అమ్మాయి వెయ్యద్దు పెట్టటం, అతను మధ్యలో నోటి కందివ్వడం, ఆ పిల్ల కళ్ల చివర్ల నుంచి మేం చూస్తున్నా మేమోనని గమనిస్తూ ఉండటం ఇలా సాగాయి వాళ్ల భోజనాలు. సరదగానే ఉంది కొత్త జంటతో ప్రయాణం అనుకున్నాను, ఆ మాటే మా వారితో అన్నాను. నెరిసిన మీసాలు రాచుకుంటూ ముసిముసిగా నవ్వారు. నా వైపు చూస్తూ, "ఏం, నీక్కూడా మన మొదటి రోజులు గుర్తొస్తున్నాయా?" అన్నారు నెమ్మదిగా. సిగ్గు ముంచుకొచ్చింది. వ లింపుగా చూశాను ఆయన వై నవ్వు దాచుకుంటూ, కళ్లెగరేసి తిరిగి పట్టుకున్నారు.

త్త జంట భోజనాలు కానిచ్చి ...ల ప్రయత్నం మొదలెట్టారు. అతను హోల్డాలు పై బెర్తు మీద పరిచాడు. కింద బెర్తుమీద దిళ్లు, దుప్పట్లు సర్ది భార్యకి పక్క తయారు చేశాడు. ఇంతలో పసివాడు లేచి కేరుకేరున ఏడవసాగాడు.

"అరెరే, ఉండవోయ్, నిన్ను మరిచి పోలేదూ" అంటూ వాడిని లాలిస్తూ భార్య కందించాడు. పసివాడిని ఒడిలో వేసుకుని కొంగు మీదికి లాక్కుని అటు తిరిగి కూర్చుంది వాడికి పాలివ్వటానికి. అతను బెర్తుకి అటు చివరగా కూర్చుని భార్యని, బిడ్డని తదేకంగా చూడసాగాడు. ఆ కళ్లలో ప్రేమ, అనురాగం, ఆరాధన వెల్లువగా ప్రవహిస్తూ ఆ పిల్లని ముంచేస్తాయేమో ననిపించింది. తల వంచుకుని బిడ్డనే గమనిస్తున్న సునీత పరాకుగా తల ఎత్తి చూసి తన్నే గమని స్తున్న భర్తని చురచురా కోపంగా చూసింది, 'ఇదేం ఇల్లనుకున్నావా, వేషాలు వెయ్యటానికి' అన్నట్టు.

"సారీ!" అంటూ చిరునవ్వుతో ...డి నుంచి లేచి మా లాయరుగారి ...వొచ్చి కూర్చున్నాడు.

పేపరు విసుగుపుట్టి పక్కన పడేస్తూ, "ఏమిటోయ్ మీ అబ్బాయి పేరు" అంటూ సంభాషణ మొదలు పెట్టారు మా ఆయన.


"అనిల్ కుమార్ అండీ" అన్నాడు.

"ఏమిటోనోయ్, ఈ తరం వాళ్లకి బెంగాలీ పేర్లంటే చాలా వ్యామోహమల్లే ఉంది!"

"మీరు శరత్ నావల్స్ ఏమయినా చదివారా, సార్?" అన్నాడు అతను ఉత్సాహంగా.

"ఏవో కొన్ని చదివాలే. నా కంటె మా ఆవిడ ఆ సాహిత్యాన్నంతా పుక్కిట పట్టిందోయ్ అగస్త్య మహర్షిలా" అన్నారు నాకేసి చూస్తూ.

"శరత్ స్త్రీలంతా హృదయం చేత కన్నీరు కార్పిస్తారు, సార్! శరత్ పాత్రలు చదివిన వెంటనే మన్ని వదిలి పోవు. వాట్ల గురించే ఆలోచించేలా చేస్తాయి" అన్నా డతను.



మా లాయరు బుర్రకి హృదయం కన్నీళ్లు కార్చట మేమిటో అర్థ మవలే దల్లే ఉంది. "ఏమిటోయ్ నువ్వు రచయితవా ఏమిటి?" అన్నారు కళ్లజోడు తీసి తుడుస్తూ. అర్థంలేని మాట లన్నీ రచయితలే ఎక్కువగా వాడుతుంటా రని మా ఆయన కో గాఢాభిప్రాయం.

అతను కాస్త సిగ్గుగా, మోడెస్ట్‌గా నవ్వాడు. "ఏదో, సార్, అప్పుడప్పుడు అదో హాబీ" అన్నాడు.

"వరకట్నాలపై, మీ అభిప్రాయ మేమిటి, సార్?" అన్నాడు ఉన్నట్లుండి.

మా వారు రెండు నిమిషాలు ఆలోచిం చారు. "వేరే చెప్పేదేముందోయ్! మను షుల్ని అమ్మటాలు, కొనుక్కోవటాలు పోతే గానీ మన ప్రజలకి విముక్తి లేదోయ్" అన్నారు రాజకీయ నాయకుడి పోజులో — కళ్ళె, కొళ్ళె, తెచ్చె అన్నట్టుగా.

"అవునూ, మ వ్వేమాత్రం పుచ్చు కున్నా వేమిటి?" అంటూ కదిపారు చివరిలో.

అతను గర్వంగా నవ్వాడు. "చాలా పెద్ద మొత్తమే ముట్టిందిలెండి" అన్నాడు భార్యవైపు చూస్తూ.

దిండ్ల మీదికి ఒరిగి పడుకున్న పిల్ల చటుక్కున తల ఎత్తి, కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

"ఎంతేమిటోయ్?" మా వారు సాగ దీశారు.

"వంద పౌన్ల పసిడి బంగారం, రెండు కెంపులు, మరో సానబట్టిన వజ్రం, ముప్ఫై రెండు ముత్యాలు, రెండు కలువలు ఇచ్చారండీ. సిట్నలోపాటు మరో అమూల్యమైనది కూడా దొరికిందిఅం.. అదెప్పుడూ పొగమంచులా, మల్లె సుగంధంలా నన్ను కమ్ముకునే ఉంటుం దండీ" లన్నాడు.

మావారు ముక్కు రాస్తూ 'ఏమిటి అంటాడు? నీకేమయినాలర్థమయిందా?' అన్నట్టు అయోమయంగా చూశారు నావైపు.

చమత్కారమయిన కుర్రాడు అనిపిం చింది నవ్వొచ్చింది.

"ఏమిటి? ! అయితే మా అత్తారు ఏ సింగపూర్లో ఉం... ఎందో" అన్నా మా ఆయన, చివరికిఆ...ర్యంగా చూస్తూ.

"అవునండీ" అన్నా డత... నమ్రతగా.

"వంద పౌన్ల బంగారమే!" మా లాయరుగారు ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు.

"అవునండీ! మా ఆవిడ బరువు వంద పౌన్లు."

"ఏమిటీ?"

"అవును, సార్! రెండు కెంపుల చెంపలు."

"ఆఁ!"

"మరో పొనబట్టిన వజ్ర నాసిక."

"ఊఁ!"

"అవునండీ. మా సుసీ పక పకా నవ్వి నప్పుడు ముప్పై రెండు ముత్యాలు మెరుస్తాయండీ."

"ఏమిటీ! ?"

"అవున్సార్. సుసీ కళ్ల ముందు కలువ రేకులు వెలవెల బోతాయండీ!"

"ఆఁ!"

"ఆవిడ ప్రేమ మల్లెల సుగంధంలా నాకు మైకం కమ్మేస్తూ ఉంటుందండీ. ఏ పని చేద్దామన్నా బుద్ధి పుట్టదు."

"హాఁ! హాఁ!"

ఆ పిల్ల నోరు తెరిచి, కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంతో తలమునక లవుతున్న మా వారినీ, కళ్లతో తన్ని తాగేసేట్టుగా చూస్తున్న ఆ కుర్రాడినీ మార్చి మార్చి చూసి కిసుక్కున నవ్వింది కొంగడ్డం పెట్టుకుని. నాకూ నవ్వాగ లేదు. కాస్త గట్టిగానే నవ్వేశాను. నావైపు చూసి సిగ్గుల మొగ్గలా ముడుచుకు పోయింది.

'నీకు బుద్ధి లేదు. ఎవరితో ఎట్లా మాటాడాలో తెలియదు. అందరితోనూ పరాసికాలేనా' అన్నట్టు చురుకు చురుకుగా చూసింది అతని వైపు.

అప్పటికి మా వారు తేరుకుని "హ హ హ" అంటూ రైలు పెట్టె దద్దరిల్లేట్టు పెద్దగా నవ్వుతూ అతని వీపు చరిచారు.

"మొత్తానికి బలే వాడివోయ్!" అన్నారు ఇంకా నవ్వుతూ.

"మా వాళ్లంతా అదే అంటారండీ. మా నాన్న పదివేలు కట్నం ముట్టందే నా పెళ్లి చెయ్యనన్నా డండీ. నీకేమో కట్నం కావాలి, నాకేమో పిల్ల కావాలి, మరి వాళ్లేమో కట్నం ఇవ్వలేరయ్యె. అందుకని పిల్లే నాకు కట్నం అనుకుంటా నని మా నాన్న కో గుడ్‌బై కొట్టేసి కొండమీద పెళ్లాడేశామండీ" అన్నాడు తను నవ్వుతూ.

టైము పదిన్నరయింది. బయట కుండపోతగా వర్షం పడుతూంది. మా వారు ఆవలిస్తూ లేచి పై బెర్తు మీద హోల్డాలు విప్పి పరవసాగారు.

"అయితే, సార్, జీవితంలో దగాపడ్డ స్త్రీల గురించి మీ అభిప్రాయ మేమిటి? వారికి తిరిగి జీవించటానికి సరయిన అవకాశం కల్పించటం మానవ ధర్మం గాదా? దాన్ని గురించి నే నొక నావల్ రాస్తున్నాను, సార్! మీ అభిప్రాయం చెప్పండి" అన్నాడు. అతనికి నిద్దర రావటం లేదల్లే ఉంది.

"ఇదుగో, అబ్బాయ్, నా కీ సాంఘిక సమస్య లంతగా బుర్ర కెక్కవోయ్. నీ కేదయినా కావలిసొస్తే మా ఆవిడని అడుగు—ఆవిడ స్త్రీల ఆశ్రమానికి గౌరవ కార్యదర్శిని. నీకు కావలసిన సమాచారం చెపుతుంది" అంటూ పైకెక్కి రగ్గు కప్పుకుని నిద్ర కుపక్రమించారు.

అతను నా వైపు కాస్త సంభ్రమంగా, కుతూహలంగా చూశాడు. పైనించి దుప్పటి తీసి చలికి కొద్దిగా ముడుచుకు పడుకున్న భార్య మీద కప్పాడు. ఆ పిల్ల కొద్దిగా కదిలి కళ్ళు తెరిచి చూసింది.

"పడు కో కూ డ దూ? మళ్లీ పొద్దుటే ఆఫీసుకి గూడా వెళ్లాలయ్యె. ఇం కిప్పుడు రాస్తూ కూర్చోకండి" అంటూ భర్తని హెచ్చరించి మళ్లీ నిద్ర లోకి జారిపోయింది.



"సుసీ! నిద్రలో బాబుని నొక్కేస్తావు. జాగ్రత్త" అంటూ హెచ్చరించాడు.

అతను సిగరెట్టు తీసుకుని తలుపు తెరిచి బయటికి వెళ్లాడు.

నేను పుస్తకం పట్టుకు కూచున్నాను. బయట భూమ్యాకాశాలు ఏకమయి నట్లుగా ఉరుములు మెరుపులతో వర్షం పడుతూంది.

• • •

"అయితే, నా కింతవరకూ ఈ సంగతి తెలియదు సుమండీ!" అన్నాడు పది నిమిషాల తరవాత లోపలి కొచ్చి మా బెర్తు చివరగా కూర్చుంటూ.

"ఏ సంగతి?" అన్నాను, చదువుతున్న పుస్తకం మడిచి పెడుతూ.

"అదే — మీరు ఆశ్రమానికి ..." అన్నాడు.

రైలు ఎక్కగానే నిద్ర అనేది నా నుంచి దూరంగా పారిపోతుంది. పగలు కానీ, రాత్రికానీ నిద్రపోనప్పుడు ఫస్టు క్లాసు దండగ ఆ జనతా క్లాసులోనే పోవచ్చు గదా-డబ్బు కలిసొస్తుంది అంటూ మా వారు సణుగుతూ ఉంటారు.

ఇతనితో కొంచెంసేపు సంభాషణ కాలక్షేపంగా ఉంటుందనిపించింది.

"అందులో ఏముంది తెలియడానికి?" అన్నాను.

"అలా అనకండి. జీవితంలో ఎన్ని దెబ్బలో తిని, నా అనే వాళ్ళు, ఆదుకునే వాళ్లు లేక, చివరగా ఈ ఆశ్రమాలకి చేరుతూ ఉంటారు ఈ అభాగ్యలంతా.—ఒక్కొక్క స్త్రీ జీవితం ఒక్కొక్క కావ్యం అవుతుందండీ" అన్నాడు ఆవేశంగా.

"కావ్యాని కవసరమయిన రసాలన్నీ వాళ్ల జీవితాల్లో కనిపించవు. ఉండేదల్లా దుఃఖం, ఆవేదనా తప్ప" అన్నాను.

అతను ఆశ్రమాన్ని గూర్చిన వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. అక్కడ జేరిన స్త్రీలు స్వశక్తి మీద బ్రతకటానికి ఉపయోగపడే ఏయే వృత్తులు, విద్యలు నేర్పిస్తారో, వారు జీవితంలో తిరిగి స్థిరపడగల అవకాశాలు ఏమిటో— అన్నీ ప్రశ్నించాడు.

అతనితో సంభాషణ పత్రికల వాళ్లతో ఇంటర్వ్యూ లాగా ఉంది.

"ఈ స్త్రీ లందరి మీద మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు చివరికి.

"ఏముంటుంది! ఒక్కొక్క స్త్రీ జీవితం ఒక్కొక్క కన్నీటి గాథ. విన్నప్పుడల్లా మనసు బాధపడుతుంది. పిల్లని పైకి తీసుకు రావటానికి, నలుగురిలా బ్రతక నేర్పటానికి ఇంకా ఏం చెయ్యగలమా అని ఆలోచిస్తాను. సాటి మనిషిగా వాళ్లకి ఇంకా ఏయే విధాలుగా సాయపడగలమా అనుకుంటూ ఉంటాను" అన్నాను.

"మిమ్మల్ని అతిగా కదిలించిన ఒక స్త్రీ జీవితాన్ని గూర్చి చెప్పండి" అన్నాడు.

"ఎవర్నని చెప్పేది? వనజ, సరోజ, వసంత, ఆదెమ్మ, రాజమ్మ — అందరిదీ ఒకటే కన్నీటి కథ. వయసు కమ్మే మైకంలో, తేనెల సోనలు లాటి మగాడి పలుకులకు ఆహుతయి, శీలం కోల్పోయి, నలుగురిలో నగుబాట్లు భరించలేక, భ్రూణ హత్యలకి, ఆత్మహత్యలకి పాల్పడే వారు, కట్టుకున్న వాడితో సంతృప్తి పడక పక్క దోవలు తొక్కి అధోగతి పాలయ్యే వాళ్ళు, సినిమాల మోజులో సిటీలకి పరుగెత్తి చివరికి భిక్షాటనకి కూడా పనికిరాకుండా తయారయిన పడతులు — అందరిదీ ఒకటే కన్నీటి కథ.

"బంగారు బొమ్మలాటి రాధ పెళ్లి అయిన నాలుగు నెల్లకే పసుపు కుంకుమలకి దూర మయింది. గత జీవిత చిహ్నంగా మిగిలిన పసిబిడ్డతో తలిదండ్రుల పంచన చేరింది. ఉద్యోగార్హత కలిగించే చదువు లేదు రాధకి. ఎదురింటి మాస్టారు విశాల హృదయంతో రాధని తన జీవితంలోకి ఆహ్వానించాడు. ఇరువైపుల వాళ్ళు వ్యతిరేకించారు ఈ వివాహానికి. పునర్వివాహ మాడి తమ వంశ ప్రతిష్ఠని మంట గలిపిన మరు క్షణం తమ గుమ్మం తొక్కనద్దన్నారు రాధ తలిదండ్రులు.

(తరువాయి 125వ పేజీలో)

# చివరి మలుపులో

(39 వ పేజీ తరువాయి)

అర్హ్నాపరు డవటం వలన మాస్టారింటి వాళ్ళు అతణ్ణి వ్యతిరేకించలేక పోయారు. పైకి సాదరంగా ఆహ్వానించి ఆదరించారు రాధని అత్తా, ఆడబిడ్డలూ, మనసులో విషాన్ని దాచుకుని. మనిషి కక్కిన విషాన్ని మింగి పసిగుడ్డు కన్ను మూసింది. బిడ్డ పోయిన దుఃఖంలో ఈ కఠిన మయిన నిజాన్ని నమ్మాలో, లేదో తెలియని రాధకి మతి చెదిరింది. మెంటల్ హాస్పిటల్‌లో చేర్చారు. ఆరు నెల్ల తరవాత తిరిగి వచ్చింది. రాను రాను తల్లీ, అప్పచెల్లెళ్ళ మాటలతో మాస్టారి మంచితనం మరుగున పడిపోయింది. స్త్రీ భరించజాలని కళంకాన్ని అంటగట్టి, రాధని బయటికి తరిమి తలుపు లేసుకున్నారు. మాస్టారింటి వాళ్ల మోసానికి బలయి, జీవితాశ నశించిన రాధ ఆత్మ హత్య చేసుకొనడానికి ప్రయత్నించింది. కొన ఊపిరితో ఉన్న రాధని మానవత్వం మాసిపోని మనుషులు ఆశ్రమంలో చేర్చారు. బ్రతికి బయటపడ్డ రాధ జీవితాశ నశించి, నిరాశా నిస్పృహలతో క్రుంగిపోతూ, ఆశ్రమాన్ని ఆవాసం చేసుకు జీవిస్తోంది.

"ఇలాంటి రాధలకి జీవితం మీద ఆశ కలిగించి, తమ కాళ్ల మీద తాము నిలబడటానికి కావలసిన ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ, మరణించిన మనసుల్ని బ్రతికించటం సాధ్యమా అనిపిస్తూ ఉంటుంది అప్పుడప్పుడు."

రైలు పెట్టెలో వాతావరణం భారంగా మారింది. అతను నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు. గ్లాసు డోరు పైకెత్తి చూశాను. కాటుక లాంటి చీకటి, వర్షం హోరు, ఉరుములు మెరుపుల ఫెళఫెళ ధ్వనులు, తళుకులు తప్ప మరేం కనిపించటం లేదు బయట. అత నింకా గంభీరంగా ఆలోచిస్తూనే ఉన్నాడు. మృదువయిన మనసు అనుకున్నాను.

కాసేపు పడుం వాలుద్దామని పక్క సరిచేస్తున్నాను. అతను చటుక్కున లేచి నించున్నాడు. "సారీ! చాలా టయిమయింది. మీకు నిద్రాభంగం కలిగించాను. క్షమించండి" అన్నాడు.

"పరవాలేదు. నాకు రైల్లో అంతగా నిద్రపట్టదు. ఇలా కాలక్షేపం చేయాల్సిందే. గూడూరు వరిగా ఎన్ని గంటల కొస్తుందో చెప్పగలరా?" అన్నాను. అతను గైడు చూసి టైము చెప్పాడు. మూడు రోజుల్నుంచీ ప్రయాణపు అలసటతో భారంగా కళ్ళుమూసుకున్నాను, మోచేయి కళ్ల కడ్డం పెట్టుకుని.

ఎదుటి బెర్తు మీద ఆ పిల్ల చలితో మరింత ముడుచుకుని పడుకుంది. అతను పై నించి మందపాటి రగ్గు తీసి ఆ పిల్లకి కప్పాడు. బెర్తు కింద భాగులోంచి కాగితాలు తీసి వ్రాస్తూ కూర్చున్నాడు. నిద్రపట్టక పక్కకు తిరిగి పడుకున్నాను.

ఓ గంట గడిచిపోయింది. పసివాడు కేరుకేరుమని ఏడుపు మొదలెట్టాడు. ఆ పిల్ల కాస్త కదిలి వాడిని దగ్గరికి లాక్కుంది. వాడు ఏడుపు మాని ఆకలి తీర్చుకోవటంలో పడ్డాడు. పసివాడిని సరిగా పడుకోపెట్టి లేచి కూర్చుంది. వ్రాస్తున్న అతని చేతిలోని పేపర్లు లాగేసుకుంది. "సునీ, సునీ, ప్లీజ్! ఒక్క పది నిమిషాల్లో అయిపోతుంది" అంటూ భార్య చేతిలో కాగితాలు లాక్కోబోయాడు. అతని చేతిని పక్కకి నెట్టేసి బాగులో పెట్టేసింది వాట్లని.

"నాలుగు రోజులు కూడా అవలేదు జ్వరం పడి. ఇంకా పూర్తిగా కోలుకోలేదు. మళ్లీ అర్ధరాత్రి రాతలు మొదలు పెట్టారా? ఎంత టైమయిందో తెలుసా? ఇంక పడుకోండి." నెమ్మదిగా, ప్రేమగా మందలిస్తోంది అతణ్ణి.

"నిద్ర రావటం లేదు, డియర్!" అన్నా డతను.

"అదే వస్తుంది. కళ్ళు మూసుకు పడుకోండి" అంది.

అతను బద్ధకంగా లేచి నించున్నాడు. "సునీ, స్లీప్ ఒన్...." అంటూ లైటు కాంతిలో మెరుస్తున్న ఆ పిల్ల చెంపల వైపు వంగాడు.

చేతిని మరి కొంచెం అడ్డంగా పెట్టుకున్నాను కళ్ళ మీద — నిద్రపడితే బాగుండును అనుకుంటూ.

"ష్! ఏమి టా మోటు పనులు! అవతల పెద్దవాళ్ళున్నారని గూడాలేకుండా. మరీ సిగ్గులేదు."

"ఆవిడ నిద్రపోయారు లేవోయ్! సునీ! వాతావరణం చాలా బాగుంది కదూ? చలిచలిగా!"


అతని మాటలు మెల్లిగా, మత్తుగా వినిపిస్తున్నాయి. గాజుల చప్పుడులో ఆ పిల్ల నవ్విన చప్పుడు కలిసిపోయింది. అతను దేనికో మారాం చెయ్యటం, ఆ పిల్ల మేం వినిపోతామేమో అన్నట్టు లోగొంతుతో నెమ్మదిగా సముదాయించటం — ఇలా ఓ పది నిమిషాలు గడిచిపోయాయి.

చివరికి భార్యని పడుకోబెట్టి రగ్గు కప్పాడు. నుదుటి మీద పడిన ముంగురులు పైకి తీసి నిశ్శబ్దంగా నుదుటిని ముద్దు పెట్టుకున్నాడు—"గుడ్ నైట్!" అంటూ.

ఆ పిల్ల అతని చేతిని తీసి పెదిమల కాన్చుకుని వదిలేసింది. అతను పై బెర్తు మీదికి వెళ్ళిపోయాడు.

ఆ పిల్ల తల కాస్త బయటికి పెట్టి, "చక్రకేళీ పళ్ళు తింటారా?" అంది మెల్లిగా.

"ఇప్పుడేం పళ్ళు, సునీ!" అన్నా డతను కిందికి తల వంచి చూస్తూ.



"మీకు అర్ధరాత్రి ఆకలవుతూ ఉంటుందిగా?" అంది చిన్నగా నవ్వుతూ.

"డార్లింగ్! నా ఆకలి పళ్లతో తగ్గదోయ్" అంటూ గాలిలోకి చిన్న ముద్దు విసిరాడు.

ఆ పిల్ల నవ్వుకుంటూ రగ్గు ముసుగు పెట్టుకు పడుకుంది.

నా ఆలోచనలన్నీ ఈ జంట చుట్టూ తిరగసాగాయి. ముచ్చటయిన జంట. ఒకరి కొకరు తీసిపోని అందం. పెద్దల్ని ఎదిర్చి వివాహ మాడారు. ఒకరి కొకరు ప్రాణం అని వాళ్ల ప్రవర్తనే చెబుతూంది. ఇద్దరూ ఇంకా వివాహపు తొలి రోజుల మైకంలోనే ఉన్నారు. ఆ పిల్ల చాలా అదృష్టవంతురాలు, అంత ప్రేమించే మొగుడు దొరికాడు అనుకున్నాను. ఆశ్రమంలోని స్త్రీలంతా గుర్తు కొచ్చారు. దైవోపహతులు. మనసంతా ఆవేదనతో నిండిపోయింది.

మరో అరగంట గడిచిపోయిఉంటుంది. ఏదో స్టేషనులో ఆగింది రైలు. పసివాడు కేరుమని శ్రుతి మొదలు పెట్టాడు. కాసేపటికి వాడి ఏడుపు ఆగింది. ఆ పిల్ల కాబిన్ తలుపు తీసి బయటికి వెళ్ళొచ్చింది. పడుకోబోతూ పై బెర్తు వైపు చూసింది. అతను చలికి ముడుచుకుని పడుకున్నట్లున్నాడు. తనలో తనే మురిపెంగా నవ్వుకుంటూ, తన రగ్గు అతనికి కప్పబోయింది. అందలేదు. పై బెర్తు గొలుసు పుచ్చుకుని, క్రింది బెర్తు మీద నించుని అతనికి రగ్గు కప్పి తిరిగి తన స్థానంలో పడుకుంది.

మరో గంట గడిచిపోయింది. వాన జోరు మరింత ఎక్కువయింది. మరో అరగంటలో గూడూరు వస్తుంది. మా వారిని మెల్లగా తట్టి లేపాను. ఆయన మూలుగుతూ, సణుగుతూ, "అప్పుడే వచ్చేసిందా?" అంటూ లేచారు. హోల్డాలు చుట్టిపెట్టారు. దిగిపోవటానికి సిద్ధంగా సామాన్లన్నీ సర్ది ఉంచాను. ఎదురు బెర్తుల మీద వాళ్లిద్దరూ గాఢంగా నిద్రపోతున్నారు. రైలు స్టేషనులో ఆగింది.

మా వారు అతణ్ణి తట్టి లేపారు. అతను ఉలిక్కిపడి లేచి, దిగొచ్చాడు. "మేం వెడుతున్నామోయ్. తలుపు లోపల గడియ పెట్టుకో" అన్నారు.

అతను డోరు వరకూ వెనకాల వచ్చాడు. "నమస్కారం, సార్. మళ్ళీ ఎప్పుడయినా కలుద్దాం ఇలాగే" అంటూ నవ్వాడు. 'నిజంగా ఎప్పుడయినా కలుసుకుంటామా?' అనుకుంటూ రైలు దిగిపోయాను.

గాలి రొదపెడుతూ మనుష్యుల్ని ఎగరకొట్టేటట్టుగా ఉంది. వర్ష తీవ్రత

అంతకంతకూ అధికమవుతూంది. సగం తడిసి ఇంటికి చేరాం.

మరునాటి రోజు పేపర్లో గత రాత్రి కుంభవృష్టి మూలాన చెర్వులు మునిగి పోయి, గూడూరు సముద్రాముల మధ్య మెయిలు జరిగిందని, ఎక్కువ పోలేదని, చాలా మందికి ప్రమాద గాయాలు తగిలా యని వచ్చిన వార్త చూసి గుండెల మీద చెయ్యి వేసుకున్నాను, మేమూ అదే రైల్లో ప్రయాణం చేశామన్న సంగతి గుర్తు కొచ్చి. ఆ యువ జంట కళ్ల ముందు కదిలారు. 'భగవాన్! వాళ్లకి ఏ ఆపదా కలగకుండా చూడు' అను కుంటూ చేతులు జోడించాను కళ్యాణ చక్రవర్తికి. మళ్లీ మధ్యలో కలిసి విడి పోయిన వాళ్లకోసం నే వింత ఇదవడ మేమిటి అనుకుంటూ నవ్వుకున్నాను. ఇదేనేమో జీవితమంటే అనిపించింది.

తిరిగి ఇన్నేళ్ళ తరవాత ఆ పిల్లని, నా రవి పక్కన నా కోడలిగా ... 'ఓహో, భగవాన్! నన్నెందు కిలా పరీక్షిస్తున్నావు?'

"ఎలా ఉందమ్మా? సడెన్‌గా అలా అయిపోయావేం?" ఆదుర్దాగా అడుగు తున్నాడు నా రవి, మీదికి వంగి.

ఏం చెప్పాలి? "ఏం లేదురా? ఈ మధ్య అప్పుడప్పుడు ఇలా వస్తోందిలే" అన్నాను.

"చాలా వీక్‌గా ఉన్నా వమ్మా. ఇంక నించీ అన్ని గొడవలు కట్టి పెట్టి పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి నువ్వు" అన్నాడు, నా నుదురు రాస్తూ.

విశ్రాంతి! నేను కావాలనుకున్నదీ, కోరుకున్నదీ కూడా అదే!

"అమ్మా! నీ ఆశయాలు, ఆదర్శాలు, నీ మృదువయిన మనసు నాకు తెలు సమ్మా. నువ్వు మా అమ్మ వైనందుకు గర్విస్తూ ఉంటాను. సీతని నువ్వు మనఃస్ఫూర్తిగా ఆదరించగలవనే తీసు కొచ్చా నమ్మా. సీతా భర్త మూడు సంవత్సరాల క్రితం ట్రెయిన్ ఆక్సి డెంట్‌లో చనిపోయాడట. తలిదండ్రులు చాలా పేదవారు. అతని ఆఫీసులోనే సీతకి ఉద్యోగం దొరికింది. ఒక రోజు రాత్రి కుర్రాడికి చాలా సుస్తీ చేసింది సడన్‌గా. అర్ధరాత్రి, ఒంటరిగా హాస్పి టల్‌కి వెళ్లలేక, దగ్గర్లో ఉన్న నా దగ్గరికి తీసుకొచ్చింది. ఆ పరిచయం అలా పెరిగింది... ఆ తరవాత ... సీత నాకు తగిన భార్య అనిపించింది. నీ రాబోయే కోడలు ఎలా ఉండాలో నువ్వు వర్ణించి చెబుతూ ఉండేదానివి గదమ్మా? నువ్వు మెచ్చే గుణాలన్నీ సీతలో ఉన్నాయమ్మా. నీకు తప్పక నచ్చుతుంది." రవి మెల్లిగా చెప్పుకుపోతున్నాడు నా పక్కలో కూర్చుని. మౌనంగా వింటున్నాను కళ్లు మూసుకుని.

"అమ్మా, నేను ఈ పని చేసినందుకు నీకు కష్టంగా ఉందా?" నా మౌనం గమనించి ప్రశ్నించాడు.

"లేదు, బాబూ, లేదు. నువ్వు చాలా మంచిపని చేశావు, రవీ!" రవి చేయిమీది నా చేయి వణికింది. రవి తృప్తిగా బయటికి వెళ్లిపోయాడు.

మా ఆయన వచ్చారు. రెండు నిమి షాలు నా వైపు పరీక్షగా చూసి పకపకా నవ్వారు.

"ఎందు కా నవ్వు?" కాస్త కోపంగా అడిగాను.

"నీ పరిస్థితి చూసి." మరి కాస్త గట్టిగా నవ్వారు.

"ఏమయింది నా పరిస్థితికి?" రోషంగా లేచి కూర్చుంటూ అడిగాను.

ఆయన ప్రేమగా నా వీపుమీద చెయ్యేసి పక్కన కూర్చున్నారు.

"చూడు, పార్వతీ! మనుషుల పెద్ద తనం బయటపడేది మాటల్లో కాదు, చేతల్లో. రైల్లో చూసిందంతా మరిచిపో. ఆ పిల్ల రవి మెచ్చిన భార్య. నీకు కోడలు. వాడు నీ మనమడు. తెలిసిందా?"

'ఓహో! ఈయ నెప్పుడూ ఎక్స్-రే తీసి నట్టుగా మనసుని చదువుతూ ఉంటారు. నే ననుకుంటున్నది ఆయన కెలా తెలు స్తుందీ! ప్రతి విషయాన్నీ ఇంత తేలిగ్గా తీసుకుని, నిర్వికారంగా జీవించగల జీవిత దృక్పథం ఈయన కెక్కడ అలవడింది? ఇన్నేళ్ల సహచర్యంలో నేను రవ్వంత కూడా నేర్చుకోలేక పోయానే!' ఆయన ఒడిలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. ఆయన నా తల నిమురుతూ అలా చాలాసేపు కూర్చుండి పోయారు.


• • •

తలుపు తీసిన అలికిడికి కళ్లు తెరిచి చూశాను. ఆ పిల్ల గుమ్మంలో నిలబడి ఉంది. నెమ్మదిగా నడిచి వచ్చింది నా దగ్గరికి. వడలిన పద్మంలాగా ముడు చుకుపోయి ఉంది. నవ్వుతో మెరిసే కళ్లలో బెదురు, విచారం, ఆరాటం గూడు కట్టుకుని ఉన్నాయి.

"మీతో కొంచెం మాట్లాడా లమ్మా" అంది నెమ్మదిగా తల వంచు కుని.

"చెప్పమ్మా" అన్నాను, నన్ను నేనే అదుపులో పెట్టుకుంటూ.

నా మంచం పక్కన నేల మీద కూర్చుంది.



జ్యోతిశ్చక్రం
ఫోటో—కె. వి. రావు (మద్రాసు—54)

"మీకు చాలా బాధ కలిగించి ఉంటా నమ్మా. మీరు రవి తల్లి అని నాకు తెలియదు. మీరంటే ఆయనకి చాలా గౌరవం, ప్రేమా. మీరు తన తల్లి కావటం తన అదృష్టం అని చెప్పేవారు. మీకు కష్టం కలిగించే పని ఏదీ ఆయన చెయ్యలేరు. అమ్మా! మీ ప్రేమాదరాన్ని పొందిన అసంఖ్యాకులయిన అనాథలలో నన్ను కూడా ఒక నిర్భాగ్యురాలిగా [illegible] మీ హృదయంలో నాకు [illegible] చోటివ్వం డమ్మా!" ఆ పిల్ల తల నా ఒడిలో పెట్టి వెక్కి వెక్కి ఏడుస్తూంది.

కళ్లు మూసుకున్నాను.

'ఎందుకు వీళ్లంతా నాకు ఇలా వాగ్బంధం చేస్తారు — నా ఆశయాలు, ఆదర్శాల పేరు చెప్పి? నా మంచితనంతో నాకు సంకెళ్లు వేయాలని ప్రయత్ని స్తారు? నేను సామాన్యమయిన, అందరి లాటి ఆశలు, కోరికలు గల మనసున్న మనిషిని. నే నేదీ లోకం కోసం, కీర్తి కోసం చేయలేదు. ఆ పిల్ల అన్యోన్య దాంపత్యాన్ని కనులారా తిలకించానే! ఇప్పుడు నా రవి పక్కన, నా కోడలుగా ఎలా ఊహించేది? భగవాన్! న న్నెందు కిలా పరీక్షిస్తున్నావు?

'ఎందుకంతా పరిహసిస్తున్నారు నన్ను చూసి? అమ్మా, నీ ఆశ్రమం, దానిలోని నీ పాత్ర అంతా నటనేనా? నువ్వు అంద ర్లాంటి సామాన్యురాలివేనా? నీ నట నంతా పేరు కోసమా? పసుపు కుంకు మలు కోల్పోయిన బాబాయి కూతురికి అందర్నీ ఎదిర్చి వివాహం చేయించావే! కాలుజారిన మాస్టారి కూతుర్ని తలి దండ్రులు గెంటేస్తే, నీడ కల్పించి ఆ పిల్లకి జీవనోపాధి కల్పించావే! లేచిపోయిన రామస్వామి భార్య పశ్చాత్తాపంతో తిరి గొచ్చి వాడి కాళ్లమీద పడినప్పుడు, వాడు దాన్ని తూలనాడి పొమ్మన్నప్పుడు ఇద్దరికీ బోధించి ఒక గూటిలో జీవించేలా చేశావే! ? ఆశ్రమంలోని ప్రతి స్త్రీకై నీ సొంత బిడ్డకై బాధపడినట్లు ఆవేదన పడేదానివే? ! అదంతా లోకంకోసం నటనేనా? ఏ తప్పూ చెయ్యని, దైవోప హతురాలయిన పిల్లని నీ కోడలుగా అంగీకరించలేవా? పితృహీను డయిన ఆ పసివాడికి తండ్రి ప్రేమ దక్కటం నీ కిష్టం లేదా, అమ్మా?" నా రవి హేళ నతో చేసే పరిహాసంతో భూమ్యాకాశాలు దద్దరిల్లి పోతున్నాయి. ఎందుకు నా చుట్టూ జనం న న్నిలా హింసిస్తు న్నారు? వద్దు, వద్దు, రవీ!

'వద్దు, రవీ. నీ తల్లిని నిరసనగా చూడకు. ఆక్షేపించకు. నేను మనః స్ఫూర్తిగా ఆ పిల్లని నా కోడలుగా

అంగీకరిస్తున్నాను. రవీ! నా ఇంటి దీపంగా, నీ భార్యగా ఈ ఇంటికి ఆహ్వానిస్తాను.'

నా కన్నీటి ధారలు ఆ పిల్ల తలని అభిషేకిస్తున్నాయి. నా ఒడిలో తల పెట్టి ఇంకా ఏడుస్తూనే ఉంది. నా చేతులతో తల పైకెత్తి కన్నీళ్ళ తుడిచాను.

"నువ్వు ఈ ఇంటి కోడలివి. నా రవి భార్యవి. ఇంటి ఇల్లాలు కంట నీరు పెట్టటం జయం కాదు. లేచి వెళ్ళి రవి కేం కావాలో చూడు" అన్నాను.

నా రవి భార్య కళ్ళెత్తి చూసింది. కారుమబ్బులు కప్పిన ఆకాశంలో తటిల్లత మెరిసినట్లు నీళ్ళ నిండిన కళ్ళ తళుక్కు మన్నాయి. తల వంచి నా కాళ్ళకి నమస్కరించింది.

• • •

రాను, రాను ఈ 'పప్పు' గాడు నాకు మరింత చేరువై పోతున్నాడు. నెమ్మదిగా వాడి పడక కూడా తల్లి దగ్గర్నుంచి నా దగ్గరికి మార్చేశాడు. మెడని కావిటేసు కుని నిద్రలో కూడా కదలనియ్యడు. 'నానమ్మ', 'నానమ్మ' అంటూ మరింతగా పొట్టలోకి దూరిపోతాడు. అర్ధరాత్రి మెలుకువ వచ్చినప్పుడు తదేకంగా వాడి మొహంలోకే చూస్తూ ఉంటాను. వాడు పూర్తిగా తండ్రి పోలిక. వాడి మొహం మీద మెరిసే చిరునవ్వులోంచి — 'మళ్ళీ ఎప్పుడో కలుసుకుందాం' అంటున్న ఆ కుర్రాడే తొంగిచూస్తూ ఉంటాడు. ఇదెక్కడి అనుబంధం? నా మెడచుట్టూ పెనవేసే ఈ చిన్నారి చేతుల కోసమే నే నెన్నో కలలు కన్నాను. కానీ, అది ఈ రూపంలో లభ్య మవుతుందని కలలో కూడా అనుకోలేదు. మానవులం ఎంత అసహాయులం!

రోజు రోజుకి నా ఆరోగ్యం దిగజారుతున్నట్లు అనిపిస్తూంది. కానీ, మనీత తోనే పెద్ద చిక్కుగా ఉంది. ఆ పిల్ల నన్ను చూసినప్పుడల్లా తప్పు చేసినట్లు తల వంచుకోవటం నా గుండెల్లో గుచ్చుకుంటూ ఉంటుంది. ఏవేవో జ్ఞాపకాని కొస్తాయి. కానీ, నా రవి తను చేసిన ఈ పనికి జీవితంలో ఏనాడూ విచారించే రోజు రాకూడదు, రానివ్వను. వాళ్ళిద్దరూ పరిపూర్ణ దాంపత్య సుఖాల్ని తనివితీరా అనుభవించాలి. నా రవి సంసారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలి. తృప్తిగా, సౌఖ్యంగా జీవించాలి. వాడి కోసం నే నేమైనా చేస్తాను. కొన్ని రోజులు ఈ గృహ నాటకం నించి నా అవసరమేమో ననిపిస్తూంది. ఏదో చెయ్యాలి? ఏం చెయ్యాలి!

దిగంతాలలోకి జారిపోతున్న సూర్య కాంతిని అవలోకిస్తున్నాను. చల్లని గాలి వీస్తూంది. ప్రకృతి ఆహ్లాదకరంగా తల ఊపుతూంది. పప్పుగాడు క్రింద బొమ్మలతో ఆడుతున్నాడు. మా వారు ఎప్పుడొచ్చారో ఆలోచనలలో గమనించనే లేదు.

"పార్వతీ, పల్లెలో ఇల్లు బాగు చేయించమని చెప్పానోయ్. ఒక వారంలో వెళదాం" అన్నారు.

"ఎందుకు?" అన్నాను ఆశ్చర్యంగా.

నవ్వారు. "నీ ఆరోగ్యం బాగుపడటానికి కొన్నాళ్ళ పల్లె గాలి మంచిదని డాక్టరు చెప్పాడు. నేనూ ఇంక ఈ ప్రాక్టీసు చెయ్యలే ననిపిస్తోంది. ప్రశాంతంగా పల్లెటూరి వాతావరణం అనుభవిద్దాం" అన్నారు నావైపు చూస్తూ. ఆ చూపులు పైకి చెప్పలేని మరెన్నిటినో చెబుతున్నాయి. నన్ను హృదయంలోంచి అర్థం చేసుకున్న మనిషి ఈయ నొక్కరే. కృతజ్ఞతగా ఆయన గుండెల మీద తల ఆన్చి కళ్ళు మూసుకున్నాను. ఈ ప్రశాంతతే నేను కోరుకునేది. ★




## ఆల్ప్స్ పర్వతాలలో మొదటి సొరంగం

ఆల్ప్స్ పర్వతాలలో మొదటి సొరంగం నిర్మించినవాడు ఫ్రెంచి ఇంజనీరు జెర్మెయిన్ సోమిలర్.

ఫ్రాన్స్, ఇటలీ దేశాలలో రైలుమార్గాలు క్రమంగా విస్తరిస్తూ ఉన్నాయి. ఆ రెండు వ్యవస్థలనూ కలపగల సొరంగం నిర్మించాలని సోమిలర్ సంవత్సరాల తరబడి కలలు గంటూ ఉన్నాడు. ఎట్టకేలకు అతడికి అవసరమైన మద్దతు లభించింది. 1857 ఆగస్టులో ఇటలీలోని బార్డనేషియా వద్దను, ఫ్రాన్స్‌లోని మోడేన్ వద్దను గని కార్మికులు త్రవ్వకం ప్రారంభించారు. మౌంట్ సెనిస్ కనుమకు సమీపంగా ఉన్న 9,660 అడుగుల ఎత్తయిన పాయింట్ డ ఫ్రేజూస్‌లో సొరంగం నిర్మించడానికి నాంది ప్రస్తావన జరిగింది. రెండు పక్కల ఉన్నవారు కలుసుకొనడానికి ఎనిమిది మైళ్ళ పొడవయిన సొరంగం నిర్మాణం కావాలి.

కార్మికులకు తుపాకిమందు, పిక్స్, హాండ్ డ్రిల్స్ మాత్రమే ఉన్నాయి అందుబాటులో. త్రవ్వకం తాబేలు వేగంతో సాగింది. రోజుకి కేవలం తొమ్మిది అంగుళాల చొప్పున మొదటి నాలుగేళ్ళు సాగింది. రాళ్ళు పడడం మూలంగాను, ప్రేలుడు ఫలితంగాను 40 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అయితే సోమిలర్ ఆధ్వర్యం క్రింద కంప్రెస్డ్ ఎయిర్ డ్రిల్స్ తయారు కావడంతో రోజుకి 14 అడుగుల మేరకు వేగం హెచ్చింది. 1867 లో డైనమైట్ కనుగొనడంకూడా సహాయకరంగా పరిణమించింది.

1870 క్రిస్టమస్‌నాడు పర్వత గర్భంలో మధ్యను రెండు వర్గాల వారు కలుసుకొన్నారు. సోమిలర్ అంచనాలు పరిపూర్ణంగా ఫలించాయి. 14 సంవత్సరాల శ్రమ ఫలితంగా 1871 లో ఆ సొరంగంలో మొదటి రైలుబండి ప్రయాణం సాగించింది.